ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 29 ఏప్రిల్ 2025 | 5

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0 (సోమవారం)
కనిష్ఠం : 26.0





విజయోత్సాహం : తుని మునిసిపల్ కౌన్సిల్ సభ్యులతో ఎమ్మెల్యే యనమల దివ్య.. చైర్‌పర్సన్ నార్ల భువన సుందరిని చైర్మన్ పీఠంపై కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే

మద్దతుని.. కూడగట్టుకుని..

తుని చైర్మన్ పీఠం టీడీపీ కైవసం

- ప్రశాంతంగా మునిసిపల్ ఎన్నిక
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఏకగ్రీవం
- చైర్‌పర్సన్‌గా భువన సుందరి
- వైస్ చైర్మన్‌గా ఆచంట సురేష్
- పట్టణంలో 144 అమలు

తునిరూరల్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): టీడీపీ మద్దతుని సంపాదించింది.. చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. కాకినాడ జిల్లా తుని మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ పీఠంతోపాటు వైస్ చైర్మన్‌ను టీడీపీ దక్కించుకుంది. టీడీపీ మద్దతు ప్రకటించిన చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, వైస్‌చైర్మన్ ఆచంట సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుని మునిసిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిల్ ఉండగా, వీరంతా వైసీపీ నుంచే గెలిచారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరొకరు రాజీనామా చేశారు. దీంతో 28 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా 15మంది కౌన్సిలర్లు టీడీపీలోకి చేరడంతో వైసీపీ బలం సన్నగిల్లింది. ఈనేపథ్యంలో ఎన్నిక లాంఛనమైంది. ఎన్నికల పరిశీలకులు, కాకినాడ జేసీ రాహుల్‌మీనా, ఎన్నికల అధికారి, డీపీవో రవికుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ కౌన్సిల్ హాల్లో ఎన్నిక నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ల కొచ్చెర్లపాటి రూపాదేవి 18వ వార్డు కౌన్సిలర్ నార్ల భువన సుందరిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ మద్దతు తెలిపారు. దీంతో మునిసిపల్ చైర్‌పర్సన్‌గా నార్ల భువనసుందరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. వైస్‌చైర్మన్‌గా 19వ వార్డు కౌన్సిలర్ ఆచంట సురేష్‌ను 28వ వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీనివాస్ మద్దతు తెలపగా, వైస్‌చైర్మన్‌గా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునిసిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య హాజరై చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందించారు. తర్వాత ఎన్నికల అధికారి రవికుమార్ నియామకపత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ముహూర్త సమయానికి ఎమ్మెల్యే దివ్య చైర్‌పర్సన్ భువన సుందరిని మునిసిపల్ పీఠంపై కూర్చోబెట్టి అభినందించారు. ఎన్నికల నేపథ్యంలో మునిసిపల్ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలుచేశారు. అలాగే డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐలు గీతారామకృష్ణ, చెన్నకేశవరావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు.



వైస్‌చైర్మన్ ఆచంట సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే దివ్య

తుని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. పట్టణాభివృద్ధికి కంకణబద్ధులై తనతో అడుగులు వేసేందుకు 15 మంది కౌన్సిలర్లు స్వచ్ఛందంగా టీడీపీలో చేరారు. వారందరి సహకారంతో పట్టణాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తా.

పదవి బాధ్యతగా భావించి పనిచేస్తా



తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ పదవిని బాధ్యతగా భావించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సూచనలతో ముందుకు వెళతా. పట్టణంలో శానిటేషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా.

- నార్ల భువన సుందరి, చైర్‌పర్సన్



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు రైతుల పరిస్థితి వివరిస్తున్న కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరరావు తదితరులు

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : కలెక్టర్

కలెక్టరేట్‌లో 233 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. అర్జీదారులకు పీజీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ జయచంద్రగాంధీ, ఎస్డీసీ కృష్ణమూర్తి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 233 అర్జీలను స్వీకరించారు. ఏ ఒక్క అర్జీని సరైన కారణాలు చూపకుండా పరిష్కరించినట్టు ఎండార్స్‌మెంట్ చేయరాదని కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అర్జీదారులు తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చని, వాటి స్థితిగతులను 1100 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

ధాన్యం కొనుగోలు టార్గెట్లను ఎత్తివేయాలి..

ధాన్యం కొనుగోలుపై ఆర్ఎస్‌కేలకు విధించిన టార్గెట్లను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అర్జీ అందజేశారు. రైతుల వద్ద మిగిలిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, చిట్టూరి వీరవెంకట సత్యనారాయణ, నిమ్మకాయల ప్రసాద్, రాయుడు వెంకటరమణ, దేవరపల్లి రాజేంద్ర, ఆర్ సరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు సహకారం.. నేడు ధిక్కారం!



డీసీసీబీ చైర్మన్ ఎంపికపై తెగని పంచాయితీ

- డీసీసీబీ చైర్మన్ ఎవరో..
- రసవత్తరంగా మారిన ఎంపిక
- తాజాగా పది జిల్లాలకు ప్రకటన
- ఉమ్మడి జిల్లా చైర్మన్ వాయిదా
- నీరుగారిన ఆశావహులు
- టీడీపీ,జనసేన మధ్య వార్
- తొలుత టీడీపీకే నిర్ణయం
- పశ్చిమ జనసేనకు
- మారిన పరిణామాలు
- పదవుల పంపకం వాయిదా
- ఎంపికపై అయోమయం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీసీసీబీ చైర్మన్ ఎంపిక రసకందాయంలో పడింది. రేపో మాపో టీడీపీ నుంచి నామినేటెడ్ చైర్మన్ పేరు ప్రకటించడానికి అంతా సిద్ధమైందనుకున్న తరుణంలో చివర్లో జిల్లా పేరే జాబితాలో మాయమైపోయింది. రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాల్లో నామినేటెడ్ డీసీసీబీ చైర్మన్లను సోమవారం ప్రకటించిన ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ పేరును పక్కన పెట్టేసింది. దీంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. అదే సమయంలో పక్కనే ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ పేరును కూడా వాయిదా వేయడంతో మరింత సస్పెన్స్ నెలకొనేలా చేసింది. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో చైర్మన్ కుర్చీ టీడీపీ, జనసేనలో ఎవరు ఏది పంచుకోవాలనేదానిపై ఇరుపార్టీల మధ్య ఏర్పడ్డ సందిగ్ధతే దీని కారణం. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమ చైర్మన్ కుర్చీ జనసేన, ఉమ్మడి తూర్పు కుర్చీ టీడీపీ తీసుకోవాలని గతంలో నిర్ణయించాయి. చివర్లో పశ్చిమ చైర్మన్ కుర్చీ కచ్చితంగా తమకు ఇవ్వాల్సిందేనని టీడీపీ పట్టుబట్టింది. ఇరుపార్టీల మధ్య నెలకొన్న కుర్చీల పంపకం గందరగోళంతో ఉభయగోదావరి జిల్లాల్లో ఎంపికను సీఎం వాయిదావేశారు. ఈక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీలో కూర్చునేది ఎవరినేది ఆసక్తికరంగా మారింది.

అంతా సిద్ధమే.. ఈలోగా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ పాలకవర్గం రద్దయింది. అప్పటివరకు వైసీపీ ప్రభుత్వంలో కొనసాగిన డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో సహా మొత్తం బోర్డు రాజీనామా చేయడంతో గతేడాది జూన్ నుంచి డీసీసీబీ చైర్మన్ కుర్చీ ఖాళీ అయింది. అయితే ఇప్పట్లో డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించే వీలులేక తాత్కాలికంగా చైర్మన్ పోస్టును నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉండడంతో సీఎం చంద్రబాబు గత కొన్ని నెలలుగా కసరత్తు చేసి టీడీపీ, జనసేన నేతలతో భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో రాష్ట్రస్థాయి పౌర సరఫరాల సంస్థ చైర్మన్, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ వంటి పలు కీలక పోస్టులను జనసేనకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న డీసీసీబీ చైర్మన్ కుర్చీని మాత్రం టీడీపీకి కేటాయించాలని ఎమ్మెల్యేలు, పార్టీ ఆశావహుల నుంచి టీడీపీ అధినేతపై ఒత్తిళ్లు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో అనేక కీలక నామినేటెడ్ పోస్టులు జనసేనకు కట్టబెట్టడంతో డీసీసీబీ టీడీపీకి, డీసీఎంఎస్ జనసేనకు ఇవ్వాలని ప్రతిపాదించారు. అదే సమయంలో డీసీసీబీ చైర్మన్ జనసేనకు, డీసీఎంఎస్ టీడీపీకి ఇవ్వాలని జనసేన నుంచి ఒత్తిడి అధికమైంది. దీంతో ఇరుపార్టీల కీలక నేతల మధ్య కొన్ని నెలల కిందట జరిగిన చర్చల్లో ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ టీడీపీకి, ఉమ్మడి పశ్చిమ డీసీసీబీ చైర్మన్ జనసేన పంచుకునేలా సూత్రప్రాయంగా ఒప్పందం కుదిరింది. ఉమ్మడి తూర్పు చైర్మన్ కుర్చీ టీడీపీకి ఖాయం అనే సంకేతాలు అందడంతో అనేక మంది టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. తమ గాడ్‌ఫాదర్‌లను, అనుకూల ఎమ్మెల్యేలను కలిసి తమ పేరు ప్రతిపాదించేలా పావులు కదిపారు. ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు సేకరించారు.



ఆశావహులకు నిరాశ..

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన జ్యోతుల నవీన్ తనకు ఎన్నికల్లో కాకినాడ ఎంపీ టికెట్ ఎలాగూ రానందున డీసీసీబీ చైర్మన్ కుర్చీ కావాలని అధిష్ఠానం వద్ద ప్రతిపాదించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి జిల్లాలో పది మంది ఎమ్మెల్యేల నుంచి తన పేరును ప్రతిపాదిస్తూ సిఫార్సు లేఖలు తీసుకున్నారు. పలువురు మంత్రుల ద్వారా రాయబారం నడిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు చేజారినందున చైర్మన్ కుర్చీ అయినా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. కోనసీమ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత మెట్ల రమణబాబు, కిర్లంపూడికి చెందిన మాజీ జడ్పీటీసీ తోట నవీన్, కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నేత పిల్లి సత్తిబాబు సైతం పదవి ఆశించారు. తమకు చైర్మన్ పదవి వరించడం ఖాయమని ఎవరికివారే లెక్కలేసుకున్న తరుణంలో అనుహ్యంగా సోమవారం ప్రకటించిన చైర్మన్ల జాబితాలో ఉమ్మడి జిల్లా పేరు లేకపోవడంతో ఆశావహులంతా కంగుతిన్నారు.

ఏ కుర్చీ ఎవరికో..

జనసేనకు ఇవ్వాలనుకున్న పశ్చిమగోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీ తమకే కావాలంటూ కొన్ని రోజులుగా అక్కడ టీడీపీ నేతలు పార్టీపై ఒత్తిడి తెస్తున్నారు. తాజా ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ దక్కనివారి నుంచి పదవులు రాని నేతలంతా తమకు చైర్మన్ పదవి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. జనసేనకు బదులు కుర్చీ టీడీపీకే ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్‌పై ఒత్తిడి తెచ్చారు. పైగా 2014లో ఉంగుటూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గన్ని వీరాంజనేయులు 2019లో ఓడిపోయారు. ప్రస్తుతం ఏలూరు పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే ఈయనకు పదవి ఇస్తామని పార్టీ ఇది వరకే హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఆప్కాబ్ చైర్మన్ పదవి ఇస్తానని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆప్కాబ్ కాకపోయినా డీసీసీబీ కుర్చీ ఇవ్వాల్సిన పరిస్థితి. మరికొందరు సీనియర్లు సైతం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ చైర్మన్ టీడీపీ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే జరిగితే ఉమ్మడి తూర్పు కుర్చీని టీడీపీ వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో మళ్లీ టీడీపీ, జనసేన గతంలో నిర్ణయించుకున్న జిల్లాల కుర్చీలు మార్చుకోవాల్సి వస్తోంది. ఈ తలనొప్పులు ప్రస్తుతం తేల్చే పరిస్థితి లేక ఈ రెండు ఉమ్మడి జిల్లాల డీసీసీబీ కుర్చీల చైర్మన్లను సీఎం ప్రకటించకుండా వాయిదా వేశారు. ఉమ్మడి తూర్పు కుర్చీ జనసేనకు విడిచిపెడితే ఇక్కడ టీడీపీ సీనియర్లు, ఆశావహులు మరింత గుర్రుగా మారనున్నారు. ఇప్పటికే కీలక పదవులు జనసేనకు వెళ్లడంతో ఇది కూడా వదిలేసుకుంటే ఎలా అనే నిట్టూర్పులు వ్యక్తం కానున్నాయి. పోనీ జనసేన ఇప్పటివరకు దీనిపై ఆశలు పెట్టుకోకపోవడంతో అసలు అభ్యర్థే లేని పరిస్థితి. ఇదిలా ఉంటే తాజాగా ప్రకటించిన డీసీసీబీ చైర్మన్ పదవులు ఆరు నెలలు మాత్రమే ఉంటాయి. ఈలోపు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ కుదరకపోతే మరో ఆరునెలల చొప్పున చైర్మన్ పోస్టును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించుకుంటూ వెళ్లవచ్చు.



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఆయుష్మాన్ ఆరోగ్యశాఖ సిబ్బంది

ఆయుష్మాన్ భారత్‌లో ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన

అమలాపురం టౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్‌భారత్ నిబంధనల మేరకు పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల జీతాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షురాలు పి.మమత జ్యోతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. గత ఆరేళ్లుగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న సతమ సమస్యలను ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లతో ఆందోళనకు దిగారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు గత రెండేళ్లుగా జీతాల చెల్లింపులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ సిబ్బందికి న్యాయం చేయాలని ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. నిరసనలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.సాయిశంకర్, జిల్లా కార్యదర్శి కె.సాయితేజ, బి.శివ, పి మనోహర్, జల్లి వెంకటేష్, సుమంత్, రాజీవ్, టి.రంగారావు, హిమజ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 23 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు అందుబాటులో లేకపోవడంతో స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 23 అర్జీలను స్వీకరించారు. వీటిని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాజశేఖర్ తెలియజేశారు.

శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బీ వంతెనలు

తాజాగా పది వంతెనలకు రూ.51 కోట్ల నిధులతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు





పి.గన్నవరం-నరేంద్రపురం రోడ్డులో వంతెన స్థితి.. కె.ముంజవరంలో శిథిలావస్థకు చేరిన వంతెన

పి.గన్నవరం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణాలను, గ్రామాలను కలుపుతూ డ్రెన్లు, కాల్వలపై ఏర్పాటైన వంతెనలకు కాలం చెల్లడంతో పలుచోట్ల శిథిలాస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా ఆర్‌అండ్‌బీకి చెందిన పలు వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులతోపాటు వంతెనలనూ పట్టించుకోలేదు. దీంతో పలు వంతెనల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కొత్తపేట మండల పరిధిలో గంటిపెదపూడి-అవిడి రహదారిలో ఉన్న వంతెన గత కొన్నేళ్ల కిందటే పూర్తిగా ధ్వంసమైంది. గత ప్రభుత్వం హయాంలో కనీసం పట్టించుకోలేదు. అలాగే పి.గన్నవరం మండల పరిధిలో కె.ముంజవరం-గోేరింకల డ్రెన్‌పై ఉన్న వంతెన మధ్య రంధ్రం ఏర్పడడంతోపాటు పిల్లరు సైతం బీటలు వారడంతో తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. అలాగే అదే డ్రెన్‌పై ముంగండపాలెం పరిధిలో ముంజవరపుకొట్టు వద్ద గాలివానకు వంతెన ఒకపక్క కుంగిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమత్తులు నిర్వహించి రక్షణగా కర్రలను ఏర్పాటు చేశారు. అలాగే పి.గన్నవరం- నరేంద్రపురం రోడ్డులో గోరింకల డ్రెన్‌పై ఉన్న వంతెన పిల్లర్లు ఒరిగిపోవడంతోపాటు వంతెన కింది భాగంలో శ్లాబులో ఏర్పాటుచేసిన సర్వే కర్రలు సైతం బయటపడ్డాయి. ఇలా జిల్లాలోని పలు మండలాల్లో వంతెనల పరిస్థితి ఇదే తీరులో ఉన్నాయి. శిథిలాస్థలో ఉన్న వంతెనలు గుర్తించి తొలుత ప్రాధాన్యం ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పది వంతెనలకు రూ.51 కోట్లు..

గత వైసీపీ ప్రభుత్వం నుంచి సంబంధిత వంతెనలకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. ఐదేళ్ల కాలంలో కనీసం ఒక్క వంతెన కూడా మంజూరు కాని పరిస్థితి నెలకొంది. ఆర్‌అండ్‌బీకి సంబంధించి జిల్లాలో సుమారు 200 వంతెనలుపైగా ఉన్నట్టు సమాచారం. తాజాగా జిల్లావ్యాప్తంగా పది వంతెనలకు ప్రతిపాదనలు నాబార్డు నిధులు రూ.51 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్తున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఊబలంక-ర్యాలీ రహదారిలో కెనాల్‌పై రూ.9 కోట్లు, ఈతకోట- కొత్తపేట రహదారిలో డ్రెన్‌పై రూ.4 కోట్లు, కొత్తపేట-ఈతకోట రహదారిలో కెనాల్‌పై రూ.3 కోట్లు, కొత్తపేట పరిధిలో బోడిపాలెం గ్రామంలో డ్రెన్‌పై రూ.6కోట్లు, పి.గన్నవరం- నరేంద్రపురం రహదారిలో మగ్రిపుంత గోరింకల డ్రెన్‌పై రూ.8 కోట్లు, కె.ముంజవరం గోరింకల డ్రెన్‌పై రూ.3 కోట్లు, ముంగండపాలెం పరిధిలో ముంజవరపుకొట్టు డ్రెన్‌పై రూ.4 కోట్లు, అవిడి -గంటిపెదపూడి రోడ్డులో డ్రెన్‌పై రూ.4 కోట్లు, రాజోలు నియోజకవర్గ పరిధిలో లక్కవరం, శంకరగుప్తం మేజర్‌డ్రెన్‌పై రూ.6 కోట్లు, వానపల్లి -అద్దంకివారిలంక కెనాల్‌పై రూ.4 కోట్లతో వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సముద్రపు నాచు సాగుతో బహుళ ప్రయోజనాలు : కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): చెరువు ఆధారిత సముద్రపు నాచు సాగు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సహజ పర్యావరణానికి దగ్గరగా ఉంటూ లాభదాయకంగా నాచు సాగుకు సముద్రతీరం వెంబడి చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లాస్థాయి అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి, డీఆర్డీఏ, ఎల్డీఎం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నాచుసాగు విస్తరణపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సముద్రపు నాచుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ రానుందని, ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ సాగును చేపట్టి లాభాలు ఆర్జిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. నాచు ఉత్పత్తుల వల్ల వ్యవసాయానికి సేంద్రీయ ఎరువుగా, పశువులకు పశుగ్రాసంగా చేపలు, కోళ్లకు మేతగా, కాస్మోటిక్ తదితర రంగాల్లో పర్యావరణ హితమైన ఉత్పత్తులను అందిస్తుందన్నారు. గచ్చకాయల పొర, ఎస్.యానం, రాజోలు సముద్ర తీర ప్రాంతాల్లో అనువైన ప్రవేశాలను అధికారులను సమన్వయం చేసుకుని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఎంపిక చేయాలని ఆదేశించారు. తొలిదశలో 40 మంది ఔత్సాహిక డ్వాక్రా సంఘాల మహిళలు, మత్స్యకార సంఘాల ప్రతినిధులను గ్రూపులుగా విభజించి తమిళనాడులోని రామనాథపురం జిల్లా మండపంలో ఎంతో ప్రాచుర్యంలో ఉన్న ఈ సాగుపై శిక్షణను ఇప్పించేలా విధివిధానాలు రూపొందించాలన్నారు. అదేవిధంగా గ్రీన్ క్లమేట్ ఫండ్, ప్రధానమంత్రి మత్స్యకార యోజన తదితర పథకాల ద్వారా యూనిట్ల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలన్నారు. తొలిదశలో శిక్షణ ముగించి రెండో దశలో శాస్త్రవేత్తలను తీసుకువచ్చి తీరం వెంబడి ఉప్పు శాతం ఆధారంగా ఏయే రకాలైన నాచు ఉత్పత్తుల పెంపకానికి అనువుగా ఉంటాయో నిర్ధారించాలన్నారు. సమావేశంలో గ్రీన్ క్లమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష, ఆర్డీవో మాధవి, జిల్లామత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, జిల్లా అటవీ అధికారి ఎంవీ ప్రసాదరావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారి శంకరరావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ, ఎల్డీఎం కేశవవర్మ పాల్గొన్నారు.

పర్యావరణానికి హితంగా..

అమలాపురం పట్టణంలో పర్యావరణానికి హాని కలగకుండా గృహ వినియోగ హానికర వ్యర్థాలను శాస్త్రీయ యూనిట్ల ద్వారా ప్రాసెస్ చేసి బూడిదగా మార్చే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. వివిధ శాఖల అధికారులతో దీనిపై సమీక్షించారు.

వెల్ల పసరు మందుకు వందేళ్లు!

- నేటికీ తగ్గని కామెర్ల రోగుల ఆదరణ
- నూరేళ్ల నుంచి సేవలు అందిస్తున్న గుండుబోగుల కుటుంబీకులు
- నేడు శతాబ్ది ఉత్సవం



కామెర్లమందు ప్యాకెట్లు పంపిణీ.. మందు ఉండలుగా తయారు చేస్తున్న దృశ్యం



వెల్ల పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది కామెర్ల పసర మందు.. దశాబ్దాల కాలంగా కామెర్ల వ్యాధి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల ప్రజలు వెల్ల పసరు మందునే ఆశ్రయిస్తూ వచ్చారు. వెల్ల గ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఉంది. కాలేయానికి వచ్చే కామెర్ల వ్యాధికి 1920 నుంచి పసరుమందు పంపిణీ చేస్తూ కామెర్ల రోగులకు సేవలు అందిస్తున్నారు దివంగత గుండుబోగుల సూర్యారావు కుటుంబీకులు. కామెర్ల మందు పంపిణీ ప్రారంభించి వందేళ్లు పూర్తికాగా మంగళవారం శతాబ్ది ఉత్సవం నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా వందేళ్ల పసరు మందుపై ప్రత్యేక కథనం..

ద్రాక్షారామ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కామెర్ల మందు తయారీ వెనుక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. 1920 ప్రాంతంలో వెల్ల గ్రామానికి సాధుపుంగవుడు దేశాటనలో భాగంగా వచ్చాడు. సాధువుకు గుండుబోగుల సూర్యారావు ఆశ్రయమిచ్చి సపర్యలు చేశారు. వారం రోజులపాటు ఉన్న సాధువు సూర్యారావు సేవాభావం చూసి ఆయనకు మంత్రోపదేశం చేసి కామెర్ల మందు తయారీ విధానం వివరించారని చెబుతారు. అయితే ఇది పూర్తి సేవాభావంతోనే మందు పంపిణీ చేయాలని షరతు పెట్టారట. సాధువు ఆదేశాలతో 1920లో గుండుబోగులు సూర్యారావు కామెర్ల మందు పంపిణీ ప్రారంభించారు. తొలుత గ్రామంలో వారికి ఇచ్చేవారు. కొన్నాళ్లకు చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చి మందు తీసుకునేవారు. తదుపరి ఇతర ప్రాంతాల నుంచి కామెర్ల మందుకు రోగులు రావడం ప్రారంభమైంది. అలా ప్రాచుర్యంలోకి వచ్చిందే వెల్ల కామెర్ల పసరు మందు.

యాగాణి.. అర్ధణాకు...

పసరు మందు తొలినాళ్లలో ఉచితంగా పంపిణీ చేసేవారు సూర్యారావు. మందుకు ఆదరణ పెరగడంతోపాటు ఎక్కువగా మందు తయారీ పదుల సంఖ్యలో కూలీలు పని చేసేవారు. ఆకులు కోసుకురావడం, రుబ్బు రోళ్లపై రుబ్బి పసరు మందు తయారీచేసేవారు. తదుపరి గ్రైండర్లు, ప్రస్తుతం మందుతయారీ, ప్యాకింగ్‌కు పూర్తిగా యంత్రాలను వాడుతున్నారు. తొలినాళ్లలో ఖర్చులకుగాను యాగాణి తదుపరి అర్ధణా తీసుకునే వారు. 1984 నాటికి ప్యాకెట్టు పావలా తీసుకునే వారు. ప్రస్తుతం ప్యాకెట్టుకు రూ.10. పెట్టారు.

ఆదివారం వచ్చిందంటే హడావుడి..

ప్రతీ ఆదివారం వెల్లలో కామెర్లమందు పంపిణీ చేస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే కామెర్ల రోగులు, బంధువులతో వెల్లలో హడావుడిగా ఉంటుంది. ప్రతీ ఆదివారం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు సీజన్‌లో వేలసంఖ్యలో రోగులు వస్తుంటారు. కామెర్ల రోగులు ఈ పసరు మందును పాలతో వేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాలు, ఆముదం, రోగులతో వచ్చినవారికి అల్పాహారం అమ్మకాలు సాగిస్తూ గ్రామంలో పదుల సంఖ్యలో కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. వాహనాలు పార్కింగ్ ద్వారా, మందు తయారీకి ఆకు సమకూర్చడం ద్వారా మరికొంతమంది ఉపాధి పొందుతున్నారు. ఇక కామెర్ల మందు పంపిణీతోపాటు మందు వాడవలసిన విధానం, చేయవలసిన పత్యం, తినకూడని వివరాలు గుండుబోగుల కుటుంబీకులు వివరిస్తారు. అదే విధంగా కామెర్లు ఎక్కువగా ఉన్న రోగులను పరీక్ష చేస్తారు. సూచనలు, సలహాలు ఇస్తారు. తదుపరి మందు పంపిణీ ప్రారంభిస్తారు.

వెల్లకు ప్రత్యేక బస్సులు

ఆదివారం కామెర్ల రోగులకు పలు జిల్లాల నుంచి వెల్లకు నేరుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, భీమవరం నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. ఆటోలైతే ఆదివారం 100కు పైగా వస్తాయి.


రాష్ట్రపతి భవన్‌కు వెల్ల మందు

కామెర్ల రోగానికి గతంలో అల్లోపతిలో వైద్య విధానం అందుబాటులో లేదు. దీంతో వెల్ల మందు కామెర్ల రోగుల పాలిట సంజీవనిగా మారింది. దీంతో వేలాది మంది రోగులు వెల్ల పసరు మందుతో ఉపశమనం పొందేవారు. దివంగత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి కుటుంబీకుల్లో ఒకరికి కామెర్లు వచ్చాయి. దీంతో సంజీవరెడ్డి కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది మల్లిడి హరినాథరెడ్డికి ఫోన్‌చేసి వివరాలు అడిగారు. దీంతో హరినాథరెడ్డి వినతి మేరకు దివంగత గుండుబోగుల సూర్యారావు ఢిల్లీ వెళ్లి పదిరోజులపాటు రాష్ట్రపతి భవన్‌లో ఉండి మందు తయారుచేసి ఇచ్చి వచ్చారు. శతాబ్ది ఉత్సవ వేళ హరినాథరెడ్డి ఈ విషయాలను పంచుకున్నారు.

సూర్యారావు విగ్రహం ఆవిష్కరణ

దివంగత గుండుబోగుల సూర్యారావు వెల్ల గ్రామంలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని 2005 ఆగస్టు పదో తేదీన చంద్రబాబు ఆవిష్కరించారు. అలాగే వెల్ల కామెర్ల వైద్యులు గుండుబోగుల స్వామినాయుడు ఇంటికి వెళ్లి గుండుబోగుల కుటుంబీకులను అభినందించారు. కామెర్లమందు తయారుచేసిన గుండుబోగుల సూర్యారావు ఎన్నో సత్కారాలు అందుకున్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు 1983లో సూర్యారావును సత్కరించి కామెర్ల వైద్యరత్న బిరుదును ప్రదానం చేశారు. తదనంతరం గుండుబోగుల నాగయ్యకాపు, స్వామినాయుడులను భీమవరంలో సినీనటుడు రవితేజ, నటుడు సునీల్, దర్శకుడు వీవీ వినాయక్‌ల చేతులమీదుగా సత్కరించారు.





గుండుబోగుల సూర్యారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు (ఫైల్)

నేడు శతాబ్ది ఉత్సవం..

వెల్ల పసరు మందుకు వందేళ్లు పూర్తికావడంతో మంగళవారం శతాబ్ది ఉత్సవం నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర భారీపరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరవుతున్నారు. మంత్రులు సుభాష్, కందుల దుర్గేష్, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరుకానున్నారు. వెబ్‌సైట్, డిజిటల్ లాంచ్ కూడా నిర్వహిస్తారు.

కామెర్ల మందు పంపిణీలో మూడు తరాలు

కామెర్ల మందు తయారీ ప్రారంభించిన గుండుబోగుల సూర్యారావు 20 జనవరి 1984లో మృతి చెందారు. గుండుబోగుల సూర్యారావు ఆదివారం ఏ పరిస్థితుల్లోనూ మందు పంపిణీ చేయాలని, తాను మరణించినా మందు పంపిణీ కొనసాగించాలని కుమారులకు నిర్దేశించారు. ఏకారణంగానూ రోగులు ఇబ్బంది పడకూడదని చెప్పారు. సూర్యారావు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించి కుమారులు అనంతరం మందు పంపిణీ చేశారు. తదుపరి ఆయన కుమారులు గుండుబోగులు నాగయ్యకాపు, గుండుబోగుల స్వామినాయుడు, కుమార్తె పాముల వీర్రాజమ్మ మందు పంపిణీ చేసేవారు. కాలక్రమంలో నాగయ్యకాపు, ఇటీవల స్వామినాయుడు కూడా మృతి చెందారు. దీంతో పాముల వీర్రాజమ్మ, కుమారులు వీరభద్రరావు, చక్రధరరావు, సురేష్‌కుమార్, నాగయ్యకాపు కుమారుడు లక్ష్మణరావు, స్వామినాయుడు కుమారులు సుధాకర్, రమేష్ అచ్యుత్ కామెర్ల మందు తయారీచేసి పంపిణీ చేస్తున్నారు.



వెల్ల మందు కోసం క్యూలైన్లలో ఉన్న జనం





కరప మండలం పాతర్లగడ్డలో పంచాయతీ చెరువుపై పరుచుకున్న పచ్చదనం

పచ్చని దుప్పటి!

ఈ చిత్రాన్ని చూసి ఏదో పచ్చని పంటను కుంటే మీరు పొరబడినట్టే. కాకినాడ జిల్లా కరప మండలం పాతర్లగడ్డలో గ్రామ పంచాయతీకి చెందిన చెరువు ఇది. పిస్టియా అనే నీటి మొక్క చెరువంతా ఇలా అల్లుకుపోయి పచ్చదనాన్ని సంతరించుకుంది. ఈ సుందర దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో ఇలా బంధించింది. చెరువంతా కప్పేసిన ఈ మొక్కను నీటి కాబేజీ లేదా నీటి కరివేపాకు అని పిలుస్తారని జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ తెలిపారు. -ఆంధ్రజ్యోతి, కరప

విజ్ఞానం.. వినోదం..

- గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన విజ్ఞాన శిబిరాలు
- జూన్ 6 వరకు నిర్వహణ
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 102 గ్రంథాలయాల్లో ప్రారంభం



కాకినాడ వివేకానంద పార్కులో మాట్లాడుతున్న సమాచారపౌర సంబంధాలశాఖ డీడీ నాగార్జున

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు రాగానే పిల్లలందరూ ఆటపాటలతో సరదాగా గడుపుతారు. బంధువుల ఇళ్లకు వెళ్తారు. ఈ వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా, ఆటపాటలతో చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా గ్రంథాలయ సంస్థ ఈ ఏడాది విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోంది. గతేడాది కంటే ఈ ఏడాది కాస్త ముందుగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న 102శాఖా గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.

వేసవిసెలవుల్లో చిన్నారులు కొంత సమయం విజ్ఞాన సముపార్జనకు కేటాయించేలా ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏటా నిర్వహిస్తోంది. టీడీపీ ప్రభుత్వహయాంలో మొదలుపెట్టిన ఈకార్యక్రమం వేలాదిమంది చిన్నారులు తమలోని ప్రతిభకు మెరుగులు దిద్దుకోవడానికి వేదికగా మారింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణితోపాటు గ్రామీణగ్రంథాలయాలు మొత్తం 102వరకు ఉన్నాయి. ప్రతి మండల కేంద్రంతోపాటు ముఖ్యమైనగ్రామాల్లోనూ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి స్థాయికి తగ్గట్టుగా శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. చిన్నారులకు అల్పాహారం, బహుమతులు తదితర వాటికి ఈ నిధులు కేటాయిస్తోంది.సోమవారంనుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు శిక్షణ ఉంటుంది. ఆటపాటలు, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాలు ఉంటాయి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


పాఠశాల విద్యార్థుల్లో సమగ్ర వికాసం పెంపొందించేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయ సంస్థ నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయని సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున అన్నారు. కాకినాడ వివేకానంద పార్కులోని గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.



సత్యదేవుని దర్శనానంతరం రఘురామకృష్ణరాజు దంపతులు

సత్యదేవుని సన్నిధిలో డిప్యూటీ స్పీకర్

అన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సోమవారం కుటుంబసభ్యులతో కలిసి విచ్చేశారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు, సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు పాల్గొన్నారు.



మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో సుబ్బారావు

సత్యదేవుని కల్యాణోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

అన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8వ తేదీన జరిగే అన్నవరం సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విచ్చేయాల్సిందిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కల్యాణోత్సవ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఈవోకు సూచించారు.



అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి మూర్తి

జేఎన్టీయూకే, వాద్వానీ ఫౌండేషన్ మధ్య ఎంవోయూ

జేఎన్టీయూకే, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని వైస్ చాన్సలర్ సమావేశ హాలులో బెంగళూరుకు చెందిన వాద్వానీ ఫౌండేషన్, జేఎన్టీయూకే మధ్య అవగాహన ఒప్పందంపై సోమవారం చర్చ జరిగింది. వర్సిటీ నుంచి ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, వాద్వానీ ఫౌండేషన్ నుంచి మూర్తి పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ ఎంవోయూ కుదుర్చుకోవడం ద్వారా తమ అధ్యాపకులు కస్టమైజ్డ్ లెర్నింగ్ ప్రోగ్రాంల ద్వారా విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వం, వ్యాపార నైపుణ్యాలు సాధికారత కలిగిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. మూర్తి మాట్లాడుతూ జేఎన్టీయూకే అధ్యాపకులకు ఎంవోయూ ద్వారా ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తామని, తద్వారా వారు విద్యార్థులకు 21వ శతాబ్దపు సమస్యలకు పరిష్కారాలు కనుగొంటారన్నారు. దేశంలో 75శాతం మంది పట్టభద్ర విద్యార్థులకు వినూత్నమైన స్టార్టప్ ఐడియాలు ఉన్నాయని, కానీ వాటిని సాకారం చేసుకునేందుకు సరైన ప్రణాళిక లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. అనంతరం ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకునేందుకు వీసీ సుముఖత వ్యక్తం చేశారు. డీపీపీ బి.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వైస్ చాన్సలర్లు జీవీఆర్ ప్రసాదరాజు, రామలింగరాజు, మురళీకృష్ణ, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, ఇన్‌చార్జి డీఈ పద్మజారాణి పాల్గొన్నారు.

32 రోజులకు రూ.1.47 కోట్లు

- వాడపల్లి వెంకన్నకు రికార్డు స్థాయిలో ఆదాయం
- బంగారం 13 గ్రాములు, వెండి కిలో 380 గ్రాములు, 64 విదేశీ కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను పర్యవేక్షణాధికారులు టీవీ ఎస్ఆర్ ప్రసాద్, బి.కిరణ్, నరేంద్రకుమార్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. 32 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,19,16,439, అన్న ప్రసాద హుండీల ద్వారా 24,51,230... మొత్తం రూ.1,47,12,969 ఆదాయం లభించింది. బంగారం 13 గ్రాములు, వెండి కిలో .380 గ్రాములు, 64 పలు దేశాల విదేశీ కరెన్సీ లభించాయి. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,45,300 లభించినట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో వాడపల్లి గ్రామస్తులు, బ్యాంకు అధికారులు, పోలీసులు, సేవకులు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.







వాడపల్లి వెంకన్న సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ విఠల్

పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయిని అయిన కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ఎం.పాండురంగ విఠల్‌కు సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ లావణ్యకుమారి అనారోగ్య కారణంగా సెలవులో ఉండడంతో డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విఠల్ మాట్లాడుతూ రోగులు, క్షతగాత్రులు, గర్భిణులు, బాలింతలకు చికిత్స, సేవలు, మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయ సహకారంతో ఆసుపత్రిని ప్రగతి పథంలో పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో ఫ్యాన్లు సక్రమంగా పని చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా అత్యవసర విభాగంలో మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న ఎక్స్‌రే యూనిట్, ఈవోటీలో సీఆర్మ్ మెషీన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విఠల్‌ను అన్ని విభాగాల వైద్యులు, మినిస్టీరియల్ సిబ్బంది, టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బంది అభినందించారు.

రేపే పాలిసెట్

- 28 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 9,525 మంది విద్యార్థులు
- కాకినాడ జిల్లా సమన్వయకర్త జనార్దనరావు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2025 బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కాకినాడ జిల్లా సమన్వయకర్త డాక్టర్ నల్లి జనార్దనరావు తెలిపారు. కాకినాడ జిల్లాలోని 28 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 9,525 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఈ ఏడాది విద్యార్థుల సౌకర్యార్థం పిఠాపురంలో కూడా కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 11గంటల తర్వాత వచ్చిన వారిని అనుమతించమన్నారు. హాల్ టికెట్‌తో పాటు పెన్, పెన్సిల్, రబ్బరు తెచ్చుకోవాలని సూచించారు. కాకినాడలోని 21 కేంద్రాల్లో 7,186 మంది, పిఠాపురంలోని ఏడు కేంద్రాల్లో 2,339 మంది ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ఫీజు ఫెయిల్యూర్, రిఫండ్, ఇతర కారణాల వల్ల హాల్ టికెట్ జనరేట్ కాకపోయినా అభ్యర్థులు కాకినాడ ఏపీటీలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సమన్వయకర్త జనార్దనరావు కోరారు.

రివైజ్డ్ పోర్టల్‌పై శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, ఏఎస్ఎంలకు హెచ్‌ఎంఐఎస్, ఆర్‌సీహెచ్ పోర్టల్, అన్మోల్ అప్లికేషన్‌పై డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కుళాయి చెరువు ప్రాంగణంలోని కాకినాడ స్మార్ట్‌సిటీ హాలులో జరిగిన సమావేశంలో డాక్టర్ నాయక్ మాట్లాడుతూ అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్లలో హెచ్‌ఎంఐఎస్ పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్ ఏ విధంగా చేయాలో (వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్, ప్రెగ్నెంట్ ఉమెన్ రిజిస్ట్రేషన్, ఎంసీహెచ్ సర్వీస్, అనీమియా డేటా) క్షుణ్ణంగా వివరించారు. ఏఎన్ఎంలు, ఆశాలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, వైద్యులు క్షేత్రస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. తద్వారా జిల్లావ్యాప్తంగా ఒక ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల ఇమ్యూనైజేషన్‌ను నూటికి నూరు శాతం విజయవంతం చేయవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ వి.అరుణ, ఎఫ్ఆర్‌టీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విల్సన్, ఎస్‌వో విజయలక్ష్మి, డెమో ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

తీపర్రులో జిల్లా స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెరవలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపర్రు గోదావరి తీరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి అప్పలరాజు, యలమరెడ్డి శ్రీకాంత్, కె.రంగారావు తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి సత్యనారాయణ, మేకా రంగారావు, సంకు సూర్యనారాయణ, వాటాల వెంకటేశ్వరరావు, మల్లాడి రాంబాబు తదితరులు సహకారం అందించారు. ఇందులో మొత్తం 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వారు వచ్చేనెల 2,3,4 తేదీల్లో కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సర్వపృష్ఠ ఆప్తోర్యామ యాగం చేయడం అదృష్టం



యాగపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సచ్చిదానంద తీర్థస్వామి

అంబాజీపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలోని తొండవరంలో సర్వపృష్ఠ ఆప్తోర్యామ యాగం చేయడం ఎంతో అదృష్టమని, ఈ యాగం దర్శించడం ద్వారా ఎంతో పుణ్యమని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌కు చెందిన సచ్చిదానంద తీర్థస్వామి పేర్కొన్నారు. తొండవరం శ్రీఉమా తొండేశ్వరస్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో జరుగుతున్న సర్వపృష్ఠ ఆప్తోర్యామ యాగాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60ఏళ్ల తరువాత ఈ యాగాన్ని నిర్వహించడం ఎంతో పుణ్యఫలమన్నారు. లోకకల్యాణార్థం ఈ యాగాన్ని దర్శించడం ఎంతో మంచిదన్నారు. 2020లో తాను శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామిజీ ఆశీస్సులతో అమరావతిలో భారీ యాగాన్ని నిర్వహించినట్టు స్వామిజీ తెలిపారు. కోనసీమ ప్రాంతంలో ఎన్నో ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అదృష్టమన్నారు.

మైనార్టీ వర్గాల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ (ఎఫ్ఏసీ) సునీల్‌కుమార్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అల్ప సంఖ్యాక (మైనార్టీ) వర్గాలకు చెందిన వారికి సబ్సిడీతో కూడిన రుణాలు కోసం అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ (ఎఫ్ఏసీ) ఎం.సునీల్ కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మైనార్టీ వర్గాలైన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శిలకు వివిధ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను తమకు దగ్గరలోని మీ సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటుతోపాటు రైస్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం నకళ్లను దరఖాస్తుదారుల మండలం, మున్సిపాల్టీ, కార్పొరేషన్ కార్యాలయాల్లో అందజేయాలని,అక్కడ నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

మురమండలో గడ్డి వాము దగ్ధం

కడియం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని మురమండలో సోమవారం పాడిరైతు ముత్యాల రామకృష్ణకు చెందిన గడ్డి వాము దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో మండపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.60 వేల మేర నష్టం సంభవించినట్టు రైతు తెలిపారు.

గోదారి మూరే దారేది!




ఇంత దారుణమా : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద అపరిశుభ్రంగా గోదావరి.. ఘాట్

జీవనది.. ఒకనాడు చూస్తే పుణ్యం..ఆ నీళ్లు నెత్తిన జల్లుకుంటే మరీ పుణ్యం.. ఆ నీళ్లు తాకితే ఇంకా పుణ్యం.. మరి నేడు.. ఈ జీవ నది కాస్తా పవిత్రమనే జీవం కోల్పోయింది.. ఎటు చూసినా.. ఎక్కడ చూసినా చెత్త.. పోనీ గోదావరిలో నీరైనా బాగుందా అంటే అదీ లేదు.. ఇదిగో ఇలా నాచు పట్టి దర్శనమిస్తోంది.. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, కోటిలింగాల ఘాట్ అక్కడా ఇక్కడ అని ఏముంది.. ఎక్కడ చూసినా ఇంతే. గోదావరిలో దిగాలంటేనే దిగులు కనిపిస్తోంది.. గతంలో సుమారు రూ.50 లక్షలతో గోదావరిలో దిగి చెత్తను శుభ్రం చేసే యంత్రం కొనుగోలు చేసినట్టు సమాచారం. మరి ఆ యంత్రం ఏమైందో తెలియదు.. గోదావరి మాత్రం రోజురోజుకు అపరిశుభ్రంగా మారుతోంది.. అయ్యా పాలకులు.. పుష్కరాలు రాబోతున్నాయి.. ఇకనైనా మేల్కోనపోతే ఎలా.. మిగిలిన సమస్యలు తరువాత ఒకసారి జీవనది పవిత్రతను కాపాడండి..

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



రోడ్ కం రైలు బ్రిడ్జి చెంత గోదావరి



చూస్తే అందం.. కానీ చూడలేం : రెండు వంతెనల మధ్య ఇలా..

గుండె నొప్పి అని గుర్తించి..ఇంజక్షన్ ఇచ్చారు..



ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వెంకట నారాయణతో మాట్లాడుతున్న డాక్టర్

- గిరిజనుడి ప్రాణం కాపాడారు
- గుండెనొప్పిగా గుర్తించిన కోతులగుట్ట సీహెచ్‌సీ వైద్యులు
- టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ ఇచ్చి గుండెకు ఊపిరినిచ్చిన వైనం

కూనవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉంచిన రూ.40 వేలు విలువైన గుండెకు సంబంధించిన టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ వల్ల వైద్యాధికారులు ఒక నిరుపేద ప్రాణాలు కాపాడారు. వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన ముత్యాల వెంకటనారాయణ శనివారం అస్వస్థతకు గురికావడంతో కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చాడు. ఆసుపత్రికి వచ్చిన సమయంలో ఛాతిలో నొప్పి, ఒళ్లంతా చెమటలు పడుతుండడంతో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వెంటనే ఆయనకు ఈసీజీ పరీక్షలు చేశారు. అతడికి గుండెనొప్పి వచ్చిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు, డ్యూటీ వైద్యాధికారి డాక్టర్ సి.తేజ గుర్తించారు. దీంతో వెంటనే ఆసుపత్రిలో ఉన్న రూ.40వేల టెన్‌క్ట్ ప్లజ్ ఇంజక్షన్ ఇచ్చారు. ఈ ఇంజక్షన్ ఇవ్వడం తో ఆ వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రికి రిఫర్ చేశారు.గుండెనొప్పి రాగానే సమయానికి ఆసుపత్రికి రావడంతో ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి తాగుతున్న ముగ్గురు యువకుల అరెస్టు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సావరం రోడ్డులోని కొబ్బరి తోటల్లో కొందరు గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో సోమవారం పట్టణ ఎస్ఐ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పట్టణానికి చెందిన యువకులు ధరణికోట బిందు వెంకటసాయిరాహుల్, మేడిశెట్టి సమీర్, అంబాజీపేటకు చెందిన గ్రంధి రాజు గంజాయి తాగుతున్నట్టు గుర్తించారు. తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ సమక్షంలో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

1న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే డే ఒక చారిత్రాత్మకమైన రోజని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. మేడే వేడుకల్లో పాల్గొనేందుకు మే 1వ తేదీన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాజమహేంద్రవరం రానున్నారని వెల్లడించారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద మెడికల్ సెక్యూరిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే)ను కార్మికలోకం అంతా ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్నంత వరకూ శ్రమ దోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం జరుగుతుందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక చట్టాలు వచ్చాయన్నారు. మెడికల్ సెక్యూరిటీ సిబ్బందికి రూ.24,000 వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, మోహన్, కుమార్, నాగేశ్వరరావు, శారద పాల్గొన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు

గోకవరం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 1వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పిల్లల రాంబాబు ఆటో డ్రైవర్. 2020 సంవత్సరంలో ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు మృతికి కారణమయ్యాడు. దీనిపై అప్పటి ఎస్ఐ పి.చెన్నారావు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం రాంబాబుపై నేరం రుజువు కావడంతో జడ్జి బి.పద్మ రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ముగ్గురు వ్యక్తుల అరెస్టు

60 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం, శాటిలైట్ సిటీ గ్రామాల్లో సోమవారం సారా బట్టీలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కోటం బూరయ్య, నిచ్చెనకోళ్ల శ్రీను, కోమలి కృష్ణలను అరెస్టు చేశారు. సారా కేంద్రాల సమాచారం తెలిసిన వారు 94409 02411కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

నటి శ్రీరెడ్డిపై ఫిర్యాదు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసి పోస్టులు పెడుతున్న నటి శ్రీరెడ్డిపై కేసు నమోదు చేయాలని తెలుగు మహిళ కాకినాడ నగర ఉపాధ్యక్షురాలు కొప్పనాతి నాగకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి కూడా శ్రీరెడ్డి సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తమ నేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, వంగలపూడి అనిత వారి కుటుంబ సభ్యులను ఉద్దేశించి బూతులు తిడుతూ ఇష్టమొచ్చినట్టు పోస్టులు పెడుతోందన్నారు. దీన్ని పరిశీలించి కేసు నమోదు చేయాలన్నారు. తమ ఫిర్యాదు మేరకు వన్ టౌన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 141/2025గా కేసు నమోదు చేశారన్నారు. ఎఫ్ఐఆర్‌లో 500, 500(2), ఐపీసీ 67, ఐటీఏ-2000-2008 సెక్షన్లు పెట్టారన్నారు.

హత్య కేసులో... ఒకరికి జీవిత ఖైదు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష రూ.10వేలు జరిమానా విధిస్తూ కాకినాడ నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలివి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన పాలెపు కాసుబాబు (23), అదే ప్రాంతానికి చెందిన మల్లాడి రవికాసు మంచి స్నేహితులు. వీరిద్దరూ కలిసి 2022 జూన్ 8న కాకినాడ మెయిన్ రోడ్డులోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్‌లో రూమ్ నెం.306 అద్దెకు తీసుకున్నారు. మద్యం సేవించే క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రవికాసు బీర్ బాటిల్ పగులగొట్టి కాసుబాబును పొడిచి హతమార్చాడు. దీంతో మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి టూటౌన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు రవికాసును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వాదోపవాదాలు పూర్తికావడంతో నిందితుడికి పైవిధంగా తీర్పునిచ్చారు. అప్పటి దర్యాప్తు అధికారిగా ఉన్న రామచంద్రరావును, కోర్టులో సాక్ష్యాధారాలను సక్రమంగా ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ మజ్జి అప్పలనాయుడును, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మిని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.

మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు



దేవరపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన దేవరపల్లి మండలం యర్నగూడెం గండిచెరువు వద్ద సోమవారం చోటుచేసుకుంది. యర్నగూడెం గ్రామానికి చెందిన ఇంజే సురేశ్ తన మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా తన వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న ఫెన్సింగ్‌పోల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో చేతికి తీవ్రగాయాల వడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు



తగలబడిపోతున్న వాహనం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీతో నడుస్తున్న ఎలక్ట్రిక్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం కాకినాడలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ వైఎస్సార్ ఫ్లైఓవర్‌పై ద్విచక్ర బ్యాటరీ వాహనం కాలిపోతున్నట్టు సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ఎన్. రమేష్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని ఆరా తీశాడు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. వాహనచోదకుడికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ. లక్ష ఆస్తినష్టంజరిగినట్టు ఏడీఎఫ్‌వో చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

● రోడ్డు ప్రమాదంలో మహిళ, చికిత్స పొందుతూ యువకుడు, లారీ ఢీకొని వృద్ధుడు..



రోడ్డుపై పడి ఉన్న రాజు మృతదేహం

తుని రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 16వ నెంబర్ తుని పట్టణ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి మృతిచెందగా, కుమారుడు తీవ్రగాయాలపాలయ్యాడు. తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ... అనకాపల్లి జిల్లా శరభవరం గ్రామానికి చెందిన వేమునిపూరి రాజు (54), ఆమె కుమారుడు రమణ (35) ద్విచక్ర వాహనంపై తుని మండలం కొత్తూరు తలుపులమ్మ జాతరకి వచ్చి వెళుతుండగా, తుని పట్టణంలోని డీమార్ట్ సమీపంలో బొలేరో వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడ్డ రమణని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించి, కేసు నమోదు చేశారు.

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా 216 జాతీయ రహదారి వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. అందులో ఒక యువకుడు చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మోటారు సైకిల్‌పై వస్తున్న అయినవిల్లి మండలం శంకరాయగూడానికి చెందిన ఉందుర్తి బాలబాలాజీ (22), కాకినాడ రూరల్ మండలం గొల్లపాలేనికి చెందిన ఖండవల్లి రాజు, అయినవిల్లి మండలం శంకరాయగూడేనికి చెందిన నిడిమోలు ఉమామహేశ్వరరావు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపలి పండువారిపేటకు చెందిన బొమ్మివినోద్ ఆదివారం కాకినాడలోని ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి ఒకే మోటారు సైకిల్‌పై వీరంతా వస్తుండగా అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో నలుగురూ గాయపడ్డారు. దీంతో వీరిని అమలాపురం కిమ్స్‌ఆసుపత్రికి తరలించగా, అందులో ఉందుర్తి బాలబాలాజీ(బాలు) ఆదివారం రాత్రి మృతిచెందాడు. మిగతా ముగ్గురు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెం సమీపంలో సోమవారం తువ్వమట్టి లారీ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు మండలం తాటిపాక కాలనీకి చెందిన మద్దుల గోపాలం (78) సైకిల్‌పై చాకలిపాలెం సెంటర్‌కు వచ్చి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో వాడ్రేవుపల్లి జంక్షన్ సమీపంలో వేవీపాలెం ర్యాంపు నుంచి హైవే పనుల నిమిత్తం తువ్వమట్టి లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో గోపాలం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. కాగా పి.గన్నవరం మండలంలో మూడు ర్యాంపులు నడుస్తున్నాయని, అక్కడ నుంచి వచ్చే లారీల వేగాన్ని నియంత్రించాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు. ఇష్టానుసారంగా నడుపుతున్నారన్నారు.

అన్నవరంలో భారీ వర్షం



అన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా వేసవితాపంతో అల్లాడిపోయిన అన్నవరం ప్రజలు సోమవారం కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. సాయంత్రం సుమారు రెండుగంటల పాటు కురవడంతో కొండపై నుంచి మెట్లమార్గం, ఘాట్‌రోడ్డులో వర్షపు నీరు జలపాతంలా ప్రవహించింది.

కలకలం రేపిన క్షుద్రపూజలు



తొండంగి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తొండంగి ఊర చెరువులో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిర్వహించిన క్షుద్ర పూజలు కలకలం రేపాయి. కాలనీ రహదారిపై ముగ్గు వేసి మధ్యలో పుర్రె, బొమ్మతోపాటు నిమ్మకాయలు ఉంచి దాని కిం ద మరో విచిత్రమైన ముగ్గను వేసి పూజలు నిర్వహించారు. ఎంపీడీవో ఆఫీసు వెనుక రహదారిలో తెల్లవారు జామున పూజలు నిర్వహించినప్పటికీ స్థానికులు ఎవరూ గమనించలేదు. ఉదయం చూసేటప్పటికి పుర్రె, మనిషి ఆకారపు బొమ్మ ఉండడం, అక్కడ ముగ్గులు నిమ్మకాయలు, తదితర వస్తువులు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గతం లో ఎప్పుడూ ఈ విధంగా జరగలేదని వారు చెబుతున్నారు. తెల్లవారు జామున కుక్కల అరుపులు వినిపించాయని, గాఢనిద్రలో ఉండడం వల్ల లేవలేకపోయామని మరికొందరు అంటున్నారు. ఎవరిని ఉద్దేశించి ఇలా చేశారో తెలీక కాలనీ వాసులు వాపోతున్నారు. దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి తగిన విధంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఏలేశ్వరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణంలోని క్వారీ ఏరియాలో ఇరువర్గాల మధ్య సోమవారం ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పలువురికి గాయాలయ్యా యి. ఈ మేరకు ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్టు ఏలేశ్వరం పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14వ తేదీన క్వారీపేటలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి మధ్య వివాదం చోటుచేసుకుంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని సోమవారం ఘర్షణకు దిగారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

తుని రైల్వేస్టేషన్‌లో తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తునిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం తుని రైల్వే స్టేషన్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ సిబ్బంది ఎంఎస్‌డీ ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంపై అనుమానిత వ్యక్తి వేలిముద్రలతోపట్టుబడ్డాడు. సంబంధిత వ్యక్తిని ఆరా తీయగా, పేరు షేక్ రహీమ్‌గా తెలుసుకున్నారు. ఇతడిపై పలు పోలీస్‌స్టేషన్లో కేసులు ఉన్నట్టు గుర్తించారు. ఆయన్ని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 20 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఓ మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా... ఆరుగురికి రెండురోజుల చొప్పున జైలు శిక్ష, మరో 14 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్టు సీఐ రమేష్ చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన యువతి ఈనెల 27వ తేదీన కాలేజీకి వెళ్లింది. మరలా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9440796622, 9154875583 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి

అమలాపురం

ప్రమాద బీమా సొమ్ము జమ

యానాం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యానాం అగ్రహారానికి చెందిన కొల్లు వీర్రాజు ఇంటి వద్దే విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందాడు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్సు క్లెయిమ్ రూ.5లక్షలు లబ్ధిదారుడి ఖాతాలో జమచేశామని మత్స్య శాఖ సహాయ సంచాలకుడు తెలిపాడు.

విజేతగా సువర్ణపేట క్రికెట్ జట్టు

అంతర్వేది, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో అండర్-19లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో సువర్ణపేటకు చెందిన జట్టు విజయం సాధించింది.లూథరన్ చర్చికు సంబంధించిన తొమ్మిది పేట జట్లు పాల్గొన్నాయి. రెండోస్థానంలో జయపేట నిలిచింది. విజేత జట్టుకు జనసేన యువ నాయకుడు బందెల శరత్‌రాయ్ రూ.5వేలు అందించారు.

1/2019 సర్క్యులర్ అమలు చేయాలి



అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో రిలే దీక్ష

అమలాపురం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో 1/2019 సర్క్యులర్‌ను అమలుచేసి ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రిలే దీక్షలకు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా తొలిరోజు సోమవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో ఎల్ఎస్ బాబు, డీఎస్ బాబు, పీఎస్ నారాయణ, జీఎస్ నారాయణ, వీవీ రత్నం, సీహెచ్ఎస్ నారాయణ రిలే దీక్షల్లో పాల్గొన్నారు. జిల్లాలోని రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల్లో సైతం రిలే దీక్షలు ప్రారంభించినట్టు యూనియన్ జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు తెలిపారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులనుకల్పించాలని, మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను ఆపాలని నినాదాలతో హోరెత్తించారు. యూనియన్ డిపో కమిటీ అధ్యక్షుడు ఎండీ ఔలియా, పితాని మణిరాజు, గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీ రన్నర్స్‌గా కిమ్స్ జట్టు



రన్నర్స్‌గా నిలిచిన కిమ్స్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ రాధికారెడ్డి తదితరులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు విశాఖపట్నం బీపీఎంపీఎస్ ఫిజియోథెరపీ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌లో కిమ్స్ ఫిజియోథెరపి క్రీడాకారుల జట్టు ప్రతిభ కనబరిచి రన్నర్స్‌గా నిలిచారు. ఈనెల24నుంచి 26 వరకు క్రికెట్ యూనియన్ ఆఫ్ ఫిజియోస్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించగా రన్నర్స్‌గా నిలిచిన కిమ్స్ జట్టుకు ట్రోఫీ, రూ.12,500 నగదు బహుమతిని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తున్న కిమ్స్ విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్యులు అభినందించారు.

టీడీపీ రాజోలు ఇన్‌చార్జిని నియమించాలి

అంతర్వేది, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సఖినేటిపల్లి గ్రామశాఖ సమావేశం గ్రామశాఖ అధ్యక్షుడు అయినవిల్లి ఏడుకొండలు అధ్యక్షతన అమలాపురం పార్లమెంటు క్రిస్టియన్ విభాగం కార్యనిర్వహక కార్యదర్శి యూనిట్ ఇన్‌చార్జి ఇంజేటి రత్నరాజు ఇంటి వద్ద నిర్వహించారు. రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ సఖినేటిపల్లి మండల కార్యదర్శి తాడి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల తొమ్మిదిపేటల రోడ్డు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకంపై సీఎం చంద్రబాబు పేరు లేకపోవడం టీడీపీ గ్రామ శాఖ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారన్నారు. అమలాపురం డీఈని నియోజకవర్గ టీడీపీ నాయకులు వివరణ కోరగా మాకు ప్రోటోకాల్ కలెక్టరేట్ ప్రోటోకాల్ విభాగం నుంచి వచ్చిందని వివరణ ఇచ్చారు. దీంతో డీఈతో టీడీపీ నాయకుల వాదోపవాదాలు జరిగాయి. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు నియోజకవర్గంలో ఎక్కడ జరిగినా శిలాఫలకాలపై ముద్రించాలని డిమాండ్‌చేస్తూ మంత్రి లోకేష్‌కు మెయిల్ ద్వారా టీడీపీ నాయకులు కోరారు. రాజోలు. నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి లేకపోవడమే దీనికి కారణమన్నారు. వెంటనే నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జిని నియమించాలని వారు మంత్రి లోకేశ్‌ను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయినవిల్లి సత్యనారాయణ, కౌరు శ్రీను, భూపతిరాజు సత్యనారాయణరాజు, పిన్నమరాజు శ్రీనివాసరాజు, బత్తెన గంగాధర్, కొప్పినీడి శ్రీనివాస్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మీ అమ్మవారి తీర్థం

పి.గన్నవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): లంకల గన్నవరం గ్రామదేవత శ్రీమహాలక్ష్మీఅమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో సమీప గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మూడేళ్లుగా నిల్వ ఉంచిన అమ్మవారి చీరలను దేవా స్థానం అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. పదిహేను రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద జాగరం జరిగింది. ఆదివారం అమ్మవారికి ఉయ్యాల సేవతో పాటు నైవేద్యాలు సమర్పించారు. ఈనెల 30న అడ్డగళ్ల వారి ఆధ్వర్యంలో ఒడి కట్టుట, దంాడింపు, బుక్కా జల్లుట కార్యక్రమాలు జరిపించిన అనంతరం అమ్మవార్ని ఆలయ ప్రవేశం చేస్తారు.

మూడు రోజులు సెలవు

యానాం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): అధిక ఉష్ణోగ్రతలు నేపథ్యంలో యానాం విద్యా శాఖ పరిధిలోని పాఠశాలలకు సోమవారం నుంచి మూడు రోజులు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఆదివారమే పుదుచ్చేరి విద్యా శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినప్పటికి యానాం విద్యా శాఖకు సరైన సమాచారం లేదు. దీంతో సోమవారం పాఠశాలలను యథావిధిగా తెరిచారు. ఆదేశాలు ఆలస్యంగా రావడంతో వచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఇంటికి పంపించారు. పుదుచ్చేరి రాష్ట్రంలో పాఠశాలలకు మే ఒకటో తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా పుస్తకాలు చదివి సద్వినియోగం చేసుకోవాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బందా ఆర్.కామేశ్వరరావు పేర్కొన్నారు. అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ఆధ్వర్యంలో ప్రతీరోజు ఉదయం 8 నుంచి 11గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయి. పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

మే 10, 11 తేదీల్లో ప్రపంచ సాహితీ సంబరాలు

అంతర్వేది, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాహిత్య, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులోని వేణుగోపాలస్వామి కల్యాణ మండపం వద్ద మే 10, 11 తేదీల్లో వైభవంగా ప్రపంచ తెలుగు సాహిత్య సంబరాలు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీకళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. సఖినేటిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ కవితోత్సవం, సాహితీ సదస్సులో వివిధ రంగస్థల ప్రదర్శనల్లో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు, మిమిక్రీలతో పాటు ఆర్ట్ గ్యాలరీ, పుస్తక ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ఏవిధమైన ఫీజు లేకుండా జ్ఞాపికను అందించిన సత్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ కొల్లి రమావతి, డాక్టర్ పార్థసారధి, జి.ఈశ్వరిభూషణం వ్యవహరిస్తారన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

యానాం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కనకాలపేటలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జారత మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పెద్దజాతరలో భాగంగా అమ్మవారి వేషధారణలు, గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం తీర్థ మహోత్సవం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు కోలాటం నిర్వహిస్తారు. యానాం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కోందడరామ, పోలేరమ్మ దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు, పోలేరమ్మ యూత్ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఉండటం వల్ల ముందుగానే వ్యాధిని నయం చేసుకోవచ్చునన్నారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌ను పరిశీలించారు. వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, సబ్‌యూనిట్ అధికారి రామారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



పి.గన్నవరం: మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, కూటమి నేతలు

పి.గన్నవరం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. కె.ఏనుగుపల్లి గ్రామంలో మత్స్యకారులకు భరోసా కల్పించినందుకు టీడీపీ జిల్లా అగ్నికుల క్షత్రియ సాధికారిక సమితి సభ్యుడు శేరు శ్రీనుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కోసం కూటమి ప్రభుత్వం వేట నిషేధ సమయంలో రాష్ట్రంలో ఉన్న 1,29,178 మత్స్యకార కుటుంబాలకు భరోసా, రాష్ట్రంలో 68,396మంది మత్స్యకారులకు నెలవారీ పింఛన్లు, వేట సమయంలో ప్రమాదం జరిగిన వ్యక్తులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా తదితర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, మద్దాల సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి కుమార్, చిట్టూరి శ్రీనివాసరావు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, కుంపట్ల నాయుడు, ఆదిమూలం సూరయ్యకాపు, బొరుసు సత్యనారాయణ, యడ్ల ఏసు, తాటికాయల శ్రీనివాసరావు, శేరు తిరుపతిరావు, తాటికాయల వెంకటేష్, శేరు శ్రీనివాసరావు, మల్లాడి గోపి, మత్స్యకార సంఘం సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవ వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ప్రతీ ఒక్కరికీ రూ.20వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేసి వారి జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపిందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం 217 జీవోను అడ్డగోలుగా తెచ్చి వారి జీవితాలను అంధకారంగా మార్చిందని, దానిని రద్దుచేసి మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు రూ.10వేలు వారి ఖాతాల్లో జమచేయగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు చొప్పున జమ చేసిందన్నారు. సమావేశంలో అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణి, మాజీ సర్పంచ్ బర్రే శ్రీనివాస్, కొల్లు రాము, పిండి సత్యనారాయణ, పొన్నాల ప్రభ పాల్గొన్నారు.

అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక అక్విడెక్టు వద్ద ఉన్న సీతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతమ్మ ఆశయాలను కూటమి ప్రభుత్వం ఆచరిస్తూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సీతమ్మ పేరును పెట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకటసత్యనారాయణ, మద్దాల సుబ్రహ్మణ్యం, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, తాటికాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కోనసీమ ఆహారనిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో సీతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు వంద మందికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరు గట్టెం, పోలిశెట్టి పవన్‌మహేష్, చీకట్ల కిరణ్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించిన నాగిడి



కాట్రేనికోన, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతి ఎంతగానో కలచివేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తున్న సమయంలో మన ఎదుగుదలను ఓర్వలేని కొన్ని దేశాలు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ పరోక్షంగా దాడులను ప్రోత్సహిస్తున్నాయన్నారు. మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఉగ్రవాదులను సమూలంగా మట్టుబెడతాయన్న విశ్వాసం తనకుందన్నారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

అల్లవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య అని టీడీపీ గ్రామ కమిటీల అధ్యక్షుడు మంతెన సురేష్‌రాజు, చింతా శ్రీనివాస్ అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధి కోసం కుట్టుశిక్షణ

ఐ.పోలవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక పురోభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలు ప్రారంభించినట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఐ.పోలవరం, కేశనకుర్రు బైర్రాజు ఫౌండేషన్ భవనాల్లో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. శిక్షణ అనంతరం కార్పొరేషన్ల ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారన్నారు. నియోజకవర్గంలో 10శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ బీర సత్యకుమారి, సాగిరాజు సూరిబాబురాజు, చిలువూరి సుబ్బరాజు, వనచర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

రాజోలు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజోలు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభించామని లైబ్రేరియన్ కె.పద్మజ తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ప్రతీరోజు పిల్లలతో కథలు చదివించడం, రాయించడం, క్రాఫ్ట్, ఇంగ్లీషు, సైన్స్, మ్యాథ్స్ డ్రాయింగ్, పాటలు, ఆటలు, నృత్యాలు, క్యారమ్స్ మొదలగు ప్రోగ్రామ్స్ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, వరప్రసాద్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ అధికారులతో నేడు చర్చలు

ఎంపీ, ఎమ్మెల్యే, ఆర్డీవోల సమక్షంలో

అల్లవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 40ఏళ్లుగా ఓఎన్జీసీ చమురు సంస్థ ఓడలరేవు నుంచి భారీగా ముడి చమురు, గ్యాస్ నిక్షేపాలు తరలించుకుపోతున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆందోళన, డిమాండ్లపై మంగళవారం అమలాపురంలో చర్చలకు రంగం సిద్ధమైంది. ఆందోళనల నేపథ్యంలో రెండు సార్లు వాయిదా కోరిన ఓఎన్జీసీ అధికారులు మంగళవారం చర్చలకు సిద్ధమని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈచర్చల్లో ఓఎన్జీసీ ఉన్నతాధికారులు, కలెక్టర్ లేదా ఆర్డీవో, ఎంపీ జి.హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, గ్రామస్తులు పాల్గొంటారన్నారు. ఇలా ఉండగా ఓడలరేవులో టెర్మినల్ వద్ద 57వ రోజు సోమవారం రిలే దీక్షలు కొనసాగాయి. టీడీపీ నాయకులు కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, కలిగితి ఏసుబాబు, గ్రామస్తులు, మహిళలు వంటా వార్పుతో నిరసన తెలిపారు.

4న అంబేడ్కరీయం కవి సమ్మేళనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన గుబ్బల రాంబాబు సారథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా కేంద్రం నిర్వహణలో మే 4న జరిగే అంబేడ్కరీయం శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్‌ను శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు సోమవారం ఆవిష్కరించారు. రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ భవనంలో 4వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు శతాధిక కవి సమ్మేళనం జరుగుతుందని కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొనే ఆసక్తి గల కవులు సెల్ 9912233739ను సంప్రదించి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

మైనార్టీ వర్గాలకు సబ్సిడీ రుణాలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ వర్గాలకు వివిధ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మెల్లిమి సునీల్‌కుమార్ తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు వంటి మైనార్టీ వర్గాలకు రుణాలను అందిస్తామన్నారు. 21 నుంచి 55ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలకు సమీపంలోని మీ సేవ కేంద్రంలో ఆన్‌లైన్‌లో సబ్సిడీతో కూడిన రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత డాక్యుమెంట్లతో పురపాలక సంఘం, మండలాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబరు 0884-2351483ని సంప్రదించాలన్నారు.

బైబిల్ స్కూలు విజేతలకు బహుమతులు

అమలాపురంటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం మన్నా జూబ్లీ చర్చిలో నాలుగు రోజులు వెకేషన్ బైబిల్ స్కూలు కార్యక్రమాలను హైదరాబాద్‌కు చెందిన బ్రదర్ సురేష్ బృందం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. పాటలు, కొరియోగ్రఫీ, నాటికలు, బైబిల్ వాఖ్యాలు నేర్పించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో పలు పోటీల విజేతలకు రెవ కార్ల్ డేవిడ్ కొమానపల్లి, షారోన్ కొమానపల్లి, లీడ్ పాస్టర్స్ ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరుజ్యోతి తాతపూడి బహుమతులు అందించారు.

మెగా వైద్య శిబిరం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్యసంఘ కల్యాణ మండపంలో వాసవిక్లబ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని సోమవారం జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. కంటి పరీక్షల విభాగాన్ని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రాము ప్రారంభించారు. మెడ్ యునైటెడ్ ఆసుపత్రి, రాజమహేంద్రవరానికి చెందిన మాక్సీ విజన్ ఆసుపత్రి వైద్య బృందంతో శిబిరం నిర్వహించగా 250మందికి ఉచితంగా పలు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎన్.సుధీర్, బి.ఉదయ్‌కుమార్‌లు వైద్యసేవలు అందించగా వాసవీక్లబ్ గవర్నర్ యెండూరి రాఘవ-నాగేశ్వరరావు, శ్రీనివాసకుమారి, తటవర్తి ప్రసాద్, వరదా సూరిబాబు, అప్పన వీరన్న, యెండూరి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీపై అవగాహన సదస్సు

మామిడికుదురు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీపై అవగాహన సదస్సు మే 2వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు అమలాపురంలోనియూటీఎఫ్ హోమంలో నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ నాయకులు సీహెచ్ కేశవరావు, బాలం పెద్దిరాజు తెలిపారు. ఈసదస్సుకు పోటీ పరీక్షల కోచింగ్ నిపుణులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, నిష్ణాతులైన అధ్యాపక బృందం పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. ఈసదస్సుకు హాజరయ్యే వారికి ఉచితంగా సైకాలజీ మెటీరియల్ అందిస్తారన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మామిడికుదురు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): లూటుకుర్రులో ఉపాధిహామీ నిధులు రూ.11లక్షలతో అభివృద్ధి పరుస్తున్న చెరువు పనులను సోమవారం బీజేపీ నాయకులు పర్యవేక్షించారు. ఉపాధి నిధులతో చెరువులకు మహర్దశ పడుతుందన్నారు. మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ, గాడి సత్తిబాబు, మెండా ఆదినారాయణ, పసుపులేటి మహలక్ష్మిరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, కోటిపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం



రైతులకు పవర్‌టిల్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైతులను ప్రోత్సహించే విధంగా యాంత్రీకరణ పథకంలో కూటమి ప్రభుత్వం పవర్ టిల్లర్లను రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద రైతులకు మంజూరైన పవర్‌టిల్లర్లను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గానికి 11 పవర్‌టిల్లర్లు మంజూరయ్యాయన్నారు. 50శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబురాజు, తాడి నరసింహారావు, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివ, నాగిడి నాగేశ్వరరావు, పొద్దోకు నారాయణరావు, ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల వ్యవసాయాధికారులు ఎం.వాణి, ఎస్.ప్రశాంత్‌కుమార్, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశ్రామికంగా అంతర్వేది అభివృద్ధి చెందాలి

అంతర్వేది, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రం ఆధ్యాత్మికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. అంతర్వేది ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక పల్లిపాలెం యువ నాయకులు కోరగా ఆయన దానికి సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేతృత్వంలో అంతర్వేది పరిసరాలు ఆధ్యాత్మికంగా, వాణిజ్య పరంగా కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్‌ను త్వరితగతిన సిద్ధం చేయాలని నాయకర్‌ను స్థానిక టీడీపీ నాయకుడు పొన్నాల విజయ్ కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ శాఖలతో చర్చిస్తానన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధి చెందిందన్నారు. పొన్నాల విజయ్, పొన్నాల ప్రభ, స్థానిక సర్పంచ్ ఒడుగు శ్రీను, పోతాబత్తుల నరసింహస్వామి, బొమ్మిడి రమేష్(దోని) పాల్గొన్నారు.

'వర్గీకరణ ఆర్డినెన్స్‌ను నిలుపుదల చేయాలి'

రాజోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్సును తక్షణమే నిలుపుదల చేయాలని మాలల న్యాయ పోరాట సమితి మండల నాయకులు డిమాండ్ చేశారు. రాజోలులో అంబేడ్కర్ సామాజిక భవనంలో జేఏసీ మండల అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం మాలల న్యాయపోరాట సమితి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు మాలల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పొలమూరి శ్యామ్‌బాబు, బత్తుల మురళీకృష్ణ, విప్పర్తి సాయిబాబు, చిలకపాటి శ్రీధర్, జిల్లెల్ల వినోద్‌బాబు, రావి విజయ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేత

ముమ్మిడివరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాణేలంక బలుసుల్లంకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో చిన్నం ప్రసాదరావుకు చెందిన తాటాకిల్లు దగ్ధమై రూ.6లక్షల మేర ఆస్తి నష్టం ఏర్పడింది. ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం ప్రమాదంలో కాలి బూడిదైన ఇంటిని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులు సమకూర్చిన నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే బాధితులకు అందించారు. నాయకులు గుత్తుల సాయి, గుద్దటి జమి, అర్థాని శ్రీనివాసరావు, బొక్కా సత్తిబాబు, కొప్పిశెట్టి శేర్, యిళ్ల ఏడుకొండలు, ఇసుకతపట్ల ఈశ్వర్‌కుమార్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి సత్యనారాయణ, కోరుకొండ శివ, చిన్నం సత్యనారాయణ, దంగేటి శ్రీను, పినిపే శ్రీను, చిన్నం జాన్, వీఆర్వో, ఆర్ఐలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కిట్లు అందజేత

మలికిపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గ్రామాల్లో మరింత పట్టు సాధించేందుకు క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు పనిచేయాలని ఆత్మ మాజీ చైర్మన్ అడబాల సాయిబాబా అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో క్లస్టర్ ఇన్‌చార్జులకు పార్టీ సభ్యత్వాల కిట్లను అందజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలన్నారు.

క్రీడాకారులకు శిక్షణ

మలికిపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని ప్రతిభ గల క్రీడాకారులకు అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్ (తూర్పుపాలెం) ఆధ్వర్యంలో మే 8 నుంచి జూన్ 8 వరకు వాలీబాల్ క్రీడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ అడబాల వేణుగోపాల్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్, కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సౌజన్యంతో జాతీయ వాలీబాల్ క్రీడాకారులు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ సహకారంతో పది నుంచి 18ఏళ్ల బాలబాలికలకు ఉదయం 6నుంచి 8గంటల వరకు, సాయంత్రం 4నుంచి 8గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. మే 5లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

మురుగు కాల్వపై వంతెన నిర్మించాలని వినతి

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి పంచాయతీలో ఉన్న రెండు ప్రాంతాలను ఒకటిగా చేసేందుకు మధ్యలో ఉన్న డ్రెయిన్‌పై వంతెన నిర్మించాలని సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. గోకనవిల్లి, విలసవిల్లి మధ్యగా ఉన్న డ్రెయిన్‌పై వంతెన నిర్మిస్తే గోకనవిల్లి ప్రజలు నేరుగా పంచాయతీ కార్యాలయానికి చేరుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకుని గోకనవిల్లి ప్రజలకు సహాయపడాలని అభ్యర్థించారు.

'కేసన అరెస్టు దారుణం'

అంబాజీపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జన గణనతో పాటు సమగ్ర కుల గణన నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో విజయవాడలో శాంతియుత నిరసన తెలుపుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అరెస్టు దారుణమని జిల్లా సంఘం అధ్యక్షుడు సంసాని రామకృష్ణ అన్నారు. నగర పోలీస్ కమిషనరు అనుమతి మహార్యాలీ నిర్వహించినప్పటికి పోలీసులు అడ్డుకుని రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పాలకులు మారినా పోలీసుల వైఖరిలో మాత్రం మార్పురాలేదన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

మామిడికుదురు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ అంబేడ్కర్ సూచించిన మార్గంలో పయనించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పాశర్లపూడిలంకలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు అంబేడ్కర్ అని, ఆయన ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లడమే అందరి లక్ష్యమన్నారు. జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, పి.గన్నవరం వైసీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, నీటి సంఘం అధ్యక్షుడు మద్దాల తమ్మన్న, తేరం గౌతమ్, పొలమూరి గోపాల్ పాల్గొన్నారు.

నల్ల తాచు హల్‌చల్

ముమ్మిడివరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాలచెరువు గ్రామానికి చెందిన ప్రసాద్ నివాస గృహంలో సోమవారం ఓ నల్ల తాచుపాము చేరి హల్‌చల్ చేసింది. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ అక్కడకు చేరుకుని వేసవి తాపంతో అల్లాడుతున్న పాముకు నీళ్లు తాగించి దాహం తీర్చాడు. డబ్బాలో బంధించాడు. నిర్మానుష్య ప్రాంతంలో వదిలి పెట్టనున్నట్టు వర్మ తెలిపారు.

మండపేట




వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.47 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,47,127 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు వెంటనే చేపట్టాలి

రాయవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే వాటిని తొలగించాలని సోమవారం బీజేపీ నాయకులు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, దేవాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పలు సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆరోపించారు. రోడ్డు పక్కన ఫ్లెక్సీలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, బీజేపీ నాయకులు చింతా తమ్మిరెడ్డి, చిరట్ల సుబ్బారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కరుటూరి శ్రీనివాస్, ఈరెళ్ల కృష్ణమూర్తి, అంగర జనార్ధన్, జనసేన నేత పెంకే వెంకటేష్ తదితరులు ఉన్నారు.



రాయవరంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



ఆలమూరు మండల పరిషత్‌లో రాష్ట్రస్థాయి అవార్డు స్వీకరించిన సర్పంచ్, కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు సత్కారం

ఆలమూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పినపళ్ల పంచాయతీకి జీవనోపాధి, పేదరికం నిర్మూలన అంశాలపై రాష్ట్రస్థాయి అవార్డును స్వీకరించిన గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్, కార్యదర్శి ఎస్.వీర్రాజులను సోమవారం సత్కరించారు. జిల్లాలో పినపళ్ల పంచాయతీకి మాత్రమే అవార్డు రావడం అభినందనీయమని పలువురు వక్తలన్నారు. మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో వీరిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, ఎంపీడీవో ఏ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంఈవో సుబ్బరాజు, అప్పాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పద్మ, మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్‌తో పాటు పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న డీవైఈవో తదితరులు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యార్థుల సత్తా అభినందనీయం

రాయవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయమని రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, ఎంఈవో -2 వై.సూర్యనారాయణ అన్నారు. సోమవారం రాయవరం ఎంఈవో కార్యాలయంలో టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు. మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.వెంకటలక్ష్మి రమ్యనందు, వెదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బోనం వెంకట భాస్కర శ్రీరాం, మాచవరం ఉన్నత పాఠశాలకు చెందిన వీవీ వసుందరలను ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు తదితరులు అభినందించారు. అనంతరం ముగ్గురు విద్యార్థులను దుశ్శాలువాతో డీవైఈవో, ఎంఈవో తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత టీచర్ చిట్టూరి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయ అధికారిణి డి.శివకుమారి మాట్లాడుతూ వేసవి శిక్షణలో నిర్వహించే అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.సతీష్, లెక్చరర్ హేమచంద్ర, ఉపాధ్యాయులు మధుమిత, సత్యవేణి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించిన దృశ్యం

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

ఆత్రేయపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సర్పంచ్ సుధ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు నివాళులర్పించారు. బాలల సాహిత్యంపై ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం జనరల్ నాలెడ్జ్, చిత్రలేఖనం, కథలు, తరగతులను నిర్వహించారు. జూన్ 6వ తేదీ వరకు విజ్ఞాన తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి టి.నమ్మశివాయ తెలిపారు.



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

ద్రాక్షారామ. ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ద్రాక్షారామ గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులకు నీతి కథలను చెప్పారు. చిన్నారులకు విశ్రాంత లెక్చరర్ బి.శివరావు పిల్లలకు విజ్ఞానదాయకమైన కథలను బోధించారు. విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఎంవీ సూరిబాబు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.దుర్గాభవాని, ఎం.సాయిరాజ్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెబుతున్న దృశ్యం



వాడపల్లిలో తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా రామానుజ ఆళ్వార్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

తిరునక్షత్ర ఉత్సవాలు ప్రారంభం

ఆత్రేయపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రామానుజ ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సేవాకాలం నీరాజనం, మంత్రపుష్పం, పల్లకీ మహోత్సవం, ప్రదక్షిణలు తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను 5 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆలయ ఉప కమిషనర్ వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

అమరావతి పనుల పునరుద్ధరణ సభను విజయవంతం చేయండి

కొత్తపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న అమరావతి పునరుద్ధరణ సభకు ప్రధాని మోదీ వస్తున్నందున దాన్ని విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. సోమవారం దెందులూరు నియోజకవర్గ అబ్జర్వర్‌గా నియమితులైన ఆయన, స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావుతో కలిసి అమరావతి సభపై మాట్లాడారు. వారు మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో కూటమి నేతలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



రన్నర్స్‌గా నిలిచిన కిమ్స్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ రాధికారెడ్డి తదితరులు

అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీ రన్నర్స్‌గా కిమ్స్ జట్టు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు విశాఖపట్నం బీఎంపీఎస్ ఫిజియోథెరపీ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌లో కిమ్స్ ఫిజియోథెరపి క్రీడాకారుల జట్టు ప్రతిభ కనబరిచి రన్నర్స్‌గా నిలిచారు. ఈనెల24నుంచి 26 వరకు క్రికెట్ యూనియన్ ఆఫ్ ఫిజియోస్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించగా రన్నర్స్‌గా నిలిచిన కిమ్స్ జట్టుకు ట్రోఫీ, రూ.12,500 నగదు బహుమతిని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తున్న కిమ్స్ విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్యులు అభినందించారు.



జొన్నాడ శ్మశానవాటికకు ఫ్రీజర్ బహూకరిస్తున్న దృశ్యం

శ్మశానవాటికకు ఫ్రీజర్ బహూకరణ

ఆలమూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జొన్నాడ గౌతమి బ్రిడ్జిల వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికకు దాత ఒకరు ఫ్రీజర్ బహూకరించారు. ఆలమూరు గ్రామానికి చెందిన వెత్సా నరసింహమూర్తి సూర్యకాంతం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సురేష్‌కుమార్, రాధికలు సోమవారం జొన్నాడకు చెందిన నామాల వెంకటరమణకు అందించారు. ఫ్రీజరు అందించిన దాతలను పలువురు అభినందించారు.

'చంద్రబాబు మానసిక పరిస్థితి ఏంటో మంత్రి సుభాష్ చెప్పాలి'

రావులపాలెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో 99 పైసలకే ఉర్సా కంపెనీకి భూములను కట్టబెట్టిన సీఎం చంద్రబాబు మానసిక పరిస్థితి ఏంటో కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పాలని వైసీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం వైసీపీ కార్యాలయం వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం గోపాలపురం వచ్చిన మంత్రి సుభాష్ మాజీ సీఎం జగన్‌పై చేసిన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మృతులకు సంతాపం

మండపేటలో జమ్ముకశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు.



ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో జరగలేదు

సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మీటింగ్ హాలులో ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో నిర్వహించలేదని ఇంకా కల్లాలోనే ధాన్యం ఉందని జడ్పీటీసీ బోనం సాయిబాబా అధికారులను నిలదీశారు. మెర్లపాలెం, వాడపల్లి, లొల్ల గ్రామాల రైతుల కోసం నిర్మిస్తున్న సైఫాన్ వల్ల ర్యాలి పంట పొలాలు ముంపుబారిన పడతాయని తద్వారా పంటపొలాలు కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగనన్న లేఅవుట్లో వేసిన ట్రాన్స్‌ఫార్మర్లు రాత్రివేళల్లో సంబంధిత అధికారులు తొలగించుకుని వెళ్లిపోయారంటూ నార్కెడిమిల్లి సర్పంచ్ పి.నాగేశ్వరరావు సంబంధిత అధికారులపై మండిపడ్డారు. మెర్లపాలెంలో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తి చేయడం లేదంటూ సర్పంచ్ రాము, ఎంపీటీసీ వీరబాబు సమావేశంలో ఏకరవు పెట్టారు. బొబ్బర్లంక నుంచి అమలాపురం కాలువ పక్కన ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు దృష్టిపెట్టి నిర్మాణాలు అడ్డుకోవాలంటూ తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో రామన్ గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. అనంతరం సభ్యులు వివిధ సమస్యలపై సమావేశంలో మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బంగార్రాజు, సర్పంచ్‌లు గాదిరాజు రామకృష్ణంరాజు, గెడ్డం సుధ, ముత్తాబత్తుల రాజు, జుజ్జవరపు శ్యామల, నరాలశెట్టి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు చేపడుతున్న పథకాలను, పనులను వివరించారు.



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న దృశ్యం

డొక్కా సీతమ్మ మండపేట ఆడపడుచు కావడం అదృష్టం

మండపేట, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మండపేటలో జన్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ పార్కు లో వున్న డొక్కా సీతమ్మ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. విజయం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు విజయ కుమార్ నేతృత్వంలో జరిగిన వర్ధంతిని ఎమ్మెల్యేతో పాటు మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, అవసరాల వీర్రాజు, జె.సూర్రావు, యినపకోళ్ల అబ్బు, ముత్యాల పద్మ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బూరుగుంట పార్కు వద్ద వున్న డొక్కా సీతమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సీతమ్మ విగ్రహానికి క్లబ్ సభ్యులు సోమవారం నివాళులర్పించారు.

పోలేరమ్మకు ఎమ్మెల్యే పూజలు: ఏడిదలో వున్న పోలేరమ్మను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకున్నారు. అమ్మవారికి ఆయన పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

టెన్త్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ల: మండపేటలో వున్న ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు పలువురు సోమవారం ఎమ్మెల్యే వేగుళ్లను కలిశారు. పార్టీ కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయులతో వచ్చిన వై.మోహన వెంకటదుర్గ, పి.బిందు సాయిశ్రీ, షేక్‌నబీలతోపాటు, జవహర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన బళ్ల పల్లవి, యర్రగుంటి కిరణ్మయిలను ఆయన అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మహర్దశ: కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే అన్నారు. వేట నిషేద సమయంలో గతంలో రూ.10వేలు ఇచ్చేవారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు పెంచిందన్నారు.



డొక్కా సీతమ్మ వర్ధంతి వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న డీవైఈవో లక్ష్మణమూర్తి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి

ద్రాక్షారామ(రామచంద్రపురం) ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం డివిజన్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డివిజన్ డీవైఈవో లక్ష్మణమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పసుపులేటి వెంకట లక్ష్మీరమ్య, వెలగల లలిత, అభినవ చంద్రహాస, బోణం వెంకట భాస్కరరామ్‌లను పలువురు అభినందించారు. వారిని రామారెడ్డి సహకారంతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమాలో మండల విద్యాధికారులు, వీర్రాఘవరెడ్డి, నాగేశ్వరి, పి.రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో ఎదుట రిలే దీక్ష దృశ్యం

ఆర్టీసీ డిపోలో 1/2019 సర్క్యులర్ అమలు చేయాలి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో 1/2019 సర్క్యులర్‌ను అమలుచేసి ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రిలే దీక్షలకు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా తొలిరోజు సోమవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో ఎల్ఎస్ బాబు, డీఎస్ బాబు, పీఎస్ నారాయణ, జీఎస్ నారాయణ, పీవీ రత్నం, సీహెచ్ఎస్ నారాయణ రిలే దీక్షల్లో పాల్గొన్నారు. జిల్లాలోని రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల్లో సైతం రిలే దీక్షలు ప్రారంభించినట్టు యూనియన్ జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు తెలిపారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులనుకల్పించాలని, మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, అక్రమ సస్పెన్షన్లు, ఆపాలని నినాదాలు చేశారు. యూనియన్ డిపో కమిటీ అధ్యక్షుడు ఎండీ జొలియా, పితాని మణిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నల్లతాచు హల్‌చల్

ముమ్మిడివరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాలచెరువు గ్రామానికి చెందిన ప్రసాద్ నివాస గృహంలో సోమవారం ఓ నల్ల తాచుపాము చేరి హల్‌చల్ చేసింది. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ అక్కడకు చేరుకుని వేసవి తాపంతో అల్లాడుతున్న పాముకు నీళ్ల తాగించి దాహం తీర్చాడు. డబ్బాలో బంధించాడు. నిర్మానుష్య ప్రాంతంలో వదిలి పెట్టనున్నట్టు వర్మ తెలిపారు.

నిబంధనల మేరకు ఇటుకబట్టీలు నిర్వహించాలి

ఆలమూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు ఇటుకబట్టీల నిర్వాహకులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండపేట కార్మికశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు సూచించారు. ఆలమూరులో సోమవారం ఇటుకబట్టీల యజమానుల సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లేబర్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి యజమాని తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలని, 18 ఏళ్లలోపు వారిని పనిలోకి పెట్టుకోకూడదన్నారు. కార్మికులందరికి బీమా చేయించాలని ఆయన తెలిపారు. అనంతరం ఇటుకబట్టీల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన చర్చించారు. సమావేశంలో సంఘ నాయకులు రామానుంజుల శేషగిరిరావు, తమలంపూడి కృష్ణారెడ్డి, పామర్తి పళ్లపరాజు, కడియాల శ్రీను, నెక్కంటి ఆనంద్, గొలుగూరి జగన్నాధరెడ్డి, జి.దుర్గారావు, గట్టి పట్టాభి, జాస్తి చిన్ని తదితరులు పాల్గొన్నారు.



ఇటుకబట్టీల యజమానులతో చర్చిస్తున్న కార్మికశాఖ అధికారి



అంకంపాలెం శివశివాని పాఠశాలకు చెందిన స్కూల్ కరస్పాండెంట్ నాగలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నాగలక్ష్మి

ఆత్రేయపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) సమావేశం విజయవాడలో సోమవారం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుందరరామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అంకంపాలెం శివశివాని హిందూ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మద్దిపాటి నాగలక్ష్మి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈమెతో ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యరాజు ప్రమాణ స్వీకారం చేయించి జ్ఞాపికతో సత్కరించారు. నలభై ఏళ్ల అప్సా చరిత్రలో తొలిసారిగా మహిళా విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఆమె ఎంపికయ్యారు. ఆమెను ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఉపసర్పంచ్ విశ్వేశ్వరి, కుదప కృష్ణమూర్తి, కరుటూరి వరప్రసాద్, కరుటూని రఘునాద్ చౌదరి, మండపేట జోన్ సభ్యులు అభినందించారు.

సాయిరామ్‌కు పలువురు నివాళి

రావులపాలెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరితో స్నేహభావంగా మెలిగే కార్యదర్శి సాయిరామ్ మృతి బాధాకరమని వక్తలన్నారు. ఆయన లేని లోటు తీరనిదని ఎంపీడీవో మహేష్, ఈవోపీర్డీ జి.కృష్ణ తదితరులు అన్నారు. రావులపాలెం మండల పరిషత్ సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమంలో సాయిరామ్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.